క్లుప్తంగా

వైద్యులకు ఘన సన్మానం


వైద్యులను సన్మానిస్తున్న కంభం లయన్స్ క్లబ్ సభ్యులు

కంభం: డాక్టర్స్ డేను పురస్కరించుకొని సోమవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంభం ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులను ఘనంగా సన్మానించారు. ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ శివనాయక్, వైద్యులు డాక్టర్ శిరీష ప్రియదర్శిని, డాక్టర్ ఫణికుమార్, లయన్ డాక్టర్ దశరథ్‌లను ఘనంగా సన్మానించారు. క్లబ్ అధ్యక్షుడు బైసాని రామకృష్ణ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సయ్యద్ జాకీర్ హుస్సేన్, చేగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, పులి శ్రీనివాస ప్రసాద్, గుండయ్య, మహబూబ్ బేఘ్, పార్శ శంకర్, మహబూబ్ బాషా, చెరుకుపల్లి శివశంకర్, మీనిగ ప్రసాద్ పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల భోజనానికి రూ.10 వేల విరాళం


చెక్కు అందజేస్తున్న రసూల్, అశోక్

పొదిలి: జిల్లాలోని ఆశ వర్కర్ల శిక్షణ తరగతులు పట్టణంలో రెండు రోజులుగా నిర్వహించారు. వీరి భోజన వసతి కోసం లాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.10 వేలు విరాళంగా అందించారు. సంస్థ తరఫున చెక్కును షేక్.రసూల్, బండి అశోక్ చేతుల మీదుగా వర్కర్ల యూనియన్ వారికి అందించారు. ఆశ వర్కర్లు లాల్ ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో షేక్.బాజీ కరీముల్లా, ఆశ వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు ఐ.రాఘవమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కల్పన, ఆశ వర్కర్ల యూనియన్ నాయకురాళ్లు కె.పద్మ, ఎం.పరిశుద్ధం, జె.సుశీల తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ


యూనిఫాం అందిస్తున్న ప్రజాప్రతినిధులు

కంభం: మండలంలోని జంగంగుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు యూనిఫాం, బూట్లు, సాక్సులు, బెల్టులు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ మనుమాసు సుజాత మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన సౌకర్యాలున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచించారు. పాఠశాలలో రోజూ ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నామని, విద్యార్థులతో డైరీ రాయిస్తున్నామని ప్రధానోపాధ్యాయుడు గని వెంకటేశ్వర్లు తెలిపారు. జెడ్పీటీసీ సభ్యురాలు కొత్తపల్లి జ్యోతి, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ కోటయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విలేకరులపై దాడి హేయమైన చర్య


సత్యాన్ని పరామర్శిస్తున్న బీజేపీ నాయకులు

గిద్దలూరు రూరల్: మండలంలోని ముండ్లపాడులో విలేకరి సత్యంపై దాడి చేయడం హేయమైన చర్యగా భావిస్తున్నామని బీజేపీ నాయకులు ఉదయ్‌శంకర్ అన్నారు. దాడికి గురై పట్టణంలోని ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న సత్యాన్ని బీజేపీ నాయకులు డాక్టర్ జేవీ నారాయణ, రామాంజనేయులు సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఉదయ్‌శంకర్ మాట్లాడుతూ నిరంతరం ప్రజల పక్షాన నిలబడి పనిచేసే విలేకరులపై దాడి కి పాల్పడటం సమంజసం కాదన్నారు. అలాంటి వారిపై చట్టం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలకు ప్రభుత్వానికి వారధులుగా పనిచేసే విలేకరులను భయభ్రాంతులకు గురి చేయడం సరైన పద్ధతి కాదన్నారు. దాడికి పాల్పడిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆన్‌లైన్‌లో వివరాలు సరి చేయాలి

పుల్లలచెరువు: చౌటపల్లి గ్రామ రెవెన్యూలో పొలాలకు సంబంధించిన వివరాలు ఆన్‌లైన్‌లో తప్పులుగా నమోదయ్యాయని, వాటిని మార్చాలని సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో స్థానిక రైతులు వినతిపత్రం అందజేశారు. రైతులు జానికి రఘు, రాములు మాట్లాడుతూ చౌటపల్లి రెవెన్యూ పరిధిలో ఉన్న 102 సర్వే నంబర్‌లకు సంబంధించిన పొలాలు రికార్డుల్లో ఇనాం పట్టాగా నమోదైందని, దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రెవెన్యూ పరిధిలోని అన్ని భూములను అధికారులు విచారణ చేసి సాధారణ స్థాయిలో ఉండే విధంగా చూడాలని కోరుతున్నారు.

వానొస్తే ఆగిపోవాల్సిందే..


నాగులవరం వద్ద గుండ్లకమ్మను దాటేందుకు ప్రయత్నిస్తున్న ప్రజలు (ఫైల్)


బొడిచర్ల వద్ద గుండ్లకమ్మప్రవాహం (ఫైల్)

- గుండ్లకమ్మపై బ్రిడ్జిల నిర్మాణం ఎప్పుడో..
- వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రజలు

మార్కాపురం రూరల్: మార్కాపురం మండలంలోని వివిధ గ్రామాల్లో వర్షాకాలంలో గుండ్లకమ్మ నదిపై బ్రిడ్జిలు లేకపోవటంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గుండ్లబ్రహ్మేశ్వరం నుంచి వచ్చే గుండ్లకమ్మ మార్కాపురం, తర్లుపాడు మండలాల్లో వివిధ గ్రామాల మీదుగా గుంటూరు జిల్లాలోకి ప్రవేశిస్తుంది. తర్లుపాడు, కంభం మధ్య బొడిచర్ల గ్రామం వద్ద, మార్కాపురం మండలంలోని నాగులవరం గ్రామం వద్ద చప్టాలపై ప్రవహిస్తుంది. వర్షాకాలంలో ఒక మోస్తారు వర్షం కురిస్తే చప్టాపై నాలుగు అడుగుల మేర నీరు ప్రవహిస్తుంది. దీంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు భయపడుతుంటారు. తర్లుపాడు-కంభం మధ్య గుండ్లకమ్మ పొంగి ప్రవహిస్తే రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. సుమారు 20 గ్రామాల ప్రజలకు ఈ రహదారి గుండా ప్రయాణించాల్సి ఉంటుంది. నాగులవరం రోడ్డు దగ్గర చప్టాపై ప్రవహిస్తే నికరంపల్లి, నాగులవరం ప్రజలు మార్కాపురం రావాలంటే సుమారు 8 కి.మీ దూరం ప్రయాణించి రావాలి. మండలంలోని వేములకోట-కుంట మధ్య ఉప్పు వాగుకు వరదనీరు వస్తే మార్కాపురం-కంభం మధ్య రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. రెండేళ్ల క్రితం ఉప్పువాగు ఉధృతంగా ప్రవహించటంతో సుమారు 12 గంటల పాటు మార్కాపురం-కంభం మధ్య గుండ్లకమ్మ ఉధృతంగా పారటంతో తర్లుపాడు-కంభం మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వర్షాకాలంలో తరచుగా ఇటువంటి పరిస్థితి ఏర్పడుతోంది. ఈ చప్టాలపై ఆర్అండ్‌బీ అధికారులు బ్రిడ్జిలు నిర్మించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. వర్షాకాలం వచ్చిందంటే ఎక్కడ గుండ్లకమ్మ, ఉప్పు వాగులు రోడ్డుపైకి ప్రవహిస్తాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ప్రజా అర్జీలను త్వరితగతిన పరిష్కరించండి

- సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా


సబ్‌కలెక్టర్‌కు అర్జీ అందచేస్తున్న ఫిర్యాదుదారుడు

మార్కాపురం టౌన్: వివిధ సమస్యలపై ప్రజలు మీకోసంలో ఇచ్చే అర్జీలను సంబంధిత అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా తెలిపారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వివిధ సమస్యలపైన రాహుల్‌మీనాకు ప్రజలు అర్జీలు అందజేశారు. మార్కాపురం పట్టణంలోని డ్రైవర్స్ కాలనీలో దొంగ ఇంటి పట్టాలు తయారుచేసి అమ్ముకుంటున్న వలి అలియాస్ కుంటి వలిపై చర్యలు తీసుకోవాలని డ్రైవర్స్‌కాలనీకి చెందిన మస్తాన్ వలి అర్జీని సబ్‌కలెక్టర్‌కు అందజేశారు. వలీ వద్ద రెవెన్యూ అధికారుల స్టాంపులు, దొంగ పట్టాలను స్వాధీనం చేసుకొని అతనిపై తగు చర్యలు తీసుకోవాలని, సిట్ బృందంచే దర్యాప్తు జరిపించాలని కోరారు. మార్కాపురం మండలం తిప్పాయపాలెంలో 1989 సంవత్సరంలో స్వాధీన ఖరారు ద్వారా 15 సెంట్ల భూమిని కొనుగోలు చేశాననీ, అయితే అదే గ్రామానికి చెందిన కొందరు అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకుని రిజిస్టర్ చేసుకున్నారని దుగ్గిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనాకు వినతిపత్రం అందచేశారు. సదరు భూమికి సంబంధించిన పూర్తి డాక్యుమెంట్లు తమ వద్ద ఉన్నాయని అయితే అక్రమంగా రిజిస్టర్ చేయించుకున్న వారి వద్ద సరైన డాక్యుమెంట్లు లేవని సదరు విషయంపై సిట్ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని తెలిపారు. విచారించి తమకు న్యాయం చేయాలని సబ్‌కలెక్టర్‌ను కోరారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో 30 మంది వీడియోగ్రాఫర్లు 60 రోజుల పాటు విధులు నిర్వర్తించారని అయితే వారికి చెల్లించాల్సిన బిల్లులను ఇప్పించాలని ఓబయ్య, ఫొటోగ్రాఫర్లు సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. తర్లుపాడు మండలం సీతానాగులవరం గ్రామానికి చెందిన తమ రిజిస్టరు భూమికి పాస్‌పుస్తకాలు ఇప్పించి ఆన్‌లైన్ చేయించాలని పి.కాశీరావు అర్జీ అందజేశారు. వివిధ సమస్యలపై పలువురు అర్జీలను సబ్‌కలెక్టర్‌కు అందచేశారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీయండి


మాట్లాడుతున్న కోర్సు డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

మార్కాపురం టౌన్: ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు శిక్షణ తరగతుల ద్వారా నేర్చుకున్న విషయాలను విద్యార్థులకు తెలియచేసి వారిలో సృజనాత్మకతను వెలికితీయాలని కోర్సు డైరెక్టర్, పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. టీక్ టూల్ కార్యక్రమంలో భాగంగా సోమవారం నుంచి ఈనెల 10వ తేదీ వరకూ జరిగే శిక్షణ కోర్సును ఆయన ప్రారంభించారు. శిక్షణ తరగతుల్లో భాగంగా మార్కాపురం, పెద్దారవీడు, పుల్లలచెరువు, దోర్నాల, అర్ధవీడు మండలాల ఉపాధ్యాయులు ఒక గ్రూపుగా, తర్లుపాడు, కొనకనమిట్ల, యర్రగొండపాలెం, దొనకొండ, త్రిపురాంతకం మండలాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు మరో గ్రూపుగా ఉంటారని అన్నారు. మొత్తం 113 మంది ఉపాధ్యాయులు శిక్షణలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్ఈఓలు రాందాస్‌నాయక్, టీ శ్రీనివాసులు పాల్గొని శిక్షణ ఉద్దేశాన్ని వివరిస్తారని అన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుల బోధన, నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు తరగతి గదుల్లో ఉపాధ్యాయుల బోధనారీతులను పరిశీలించేందుకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్స్ శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, ఏ శ్రీనివాసులు, నాగరాజు, నరసింహారావు, వివిధ మండలాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తొలిరోజు పింఛన్ల పంపిణీ


తర్లుపాడులో పింఛను పంపిణీ చేస్తున్న సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా


కుర్చీలో కూర్చుని పింఛన్ పంపిణీ చేస్తున్న సిబ్బంది

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని 7, 30వ వార్డుల్లో సోమవారం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పింఛను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు. జనసేన ఇన్‌చార్జి ఇమ్మడి కాశీనాథ్ పట్టణంలోని 21వ వార్డులో ఇంటింటికీ వెళ్లి పింఛను అందజేశారు.

డయాలసిస్ పింఛన్ అందించిన సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా

తర్లుపాడు: మండల కేంద్రం తర్లుపాడులో డయాలసిస్ పింఛన్లు మార్కాపురం సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా సోమవారం లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖరరావు, పంచాయతీ సెక్రటరీ అచ్యుతరావు, వీఆర్‌ఓ భాస్కర్, ఏపీఎం పిచ్చయ్య, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ చేసిన సబ్‌కలెక్టర్

మార్కాపురం రూరల్: మండలంలోని చింతగుంట్ల గ్రామంలో పెంచిన పింఛన్లను సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా సోమవారం లబ్ధిదారులకు అందచేశారు. మండలంలో మొత్తం 7169 పింఛన్లు ఉన్నాయనీ, సోమవారం సాయంత్రానికి 95 శాతం పంపిణీ చేసినట్లు మార్కాపురం ఎంపీడీఓ తోట చందన తెలిపారు.

పింఛన్ల పంపిణీ ప్రారంభించిన భాస్కర్

పొదిలి: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని సోమవారం పట్టణంలోని ఐదో సచివాలయం పరిధిలో ఆర్యవైశ్య సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్ ప్రారంభించారు. 13,14 వార్డులకు సంబంధించి లబ్ధిదారులకు పింఛన్లు ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గునుపూడి మాధవి, మాజీ సర్పంచ్ కాటూరి నారాయణ ప్రతాప్, మాజీ ఉపసర్పంచ్ షేక్.జిలానీ, పలువురు పార్టీ నాయకులు పాల్గొని పింఛన్లు పంపిణీ చేశారు.

గిద్దలూరు రూరల్: గిద్దలూరులో అధికార యంత్రాంగం పింఛన్ల పంపిణీ సందర్భంగా ఇబ్బందికి గురైంది. ప్రతి పింఛన్‌దారుడి ఇంటి వద్దకు వెళ్లి పింఛను నగదు అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించడంతో సిబ్బంది మాత్రం పింఛనుదారులను ఒక చోటికి పిలిపించుకుని మరీ పింఛన్లు పంపిణీ చేశారు. రాచర్ల రోడ్డులోని సచివాలయం మహిళా ఉద్యోగిని పింఛనుదారులను ఒక చోటికి పిలుచుకుని కుర్చీలో కూర్చుని పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలోని ముండ్లపాడు గ్రామంలోనూ సచివాలయం సిబ్బంది లబ్ధిదారులను ఒక చోటికి పిలుచుకుని మరీ పింఛను నగదు పంపిణీ చేశారు. దిగువమెట్ట తండా గ్రామ పంచాయతీలో రాములవారి ఆలయం వద్ద కె.ఎస్.పల్లె కు చెందిన టీడీపీ నాయకుడు పాలుగుళ్లప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో సచివాలయం సిబ్బంది పింఛన్లు పంపిణీ చేయడంపై గ్రామ సర్పంచి అంజినాయక్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కింది స్థాయి అధికారులు గ్రామ సర్పంచికి కనీస సమాచారం ఇవ్వకుండానే టీడీపీ నాయకుల చేత పింఛన్లు పంపిణీ చేయించడం ఎంతవరకు సమంజసం అంటూ అసహనం వ్యక్తం చేశాడు.

శ్రావణి మాతృమూర్తి కాశమ్మకు అన్నా, ఉడుముల నివాళి


నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నా

పొదిలి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, కాపు సంఘం జిల్లా నాయకుడు శ్రావణి వెంకటేశ్వర్లు మాతృమూర్తి వెలిశెట్టి కాశమ్మ(83) సోమవారం మృతి చెందారు. ఆమె కొంత కాలంగా అనారోగ్యంతో ఉన్నారు. ఆమెకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద కొడుకు శ్రావణి వెంకటేశ్వర్లు, పెద్ద కోడలు మాజీ ఎంపీపీ వెలిశెట్టి విజయగౌరి. కాశమ్మ మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే మార్కాపురం వైఎస్సాఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ అన్నా రాంబాబు, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డి సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో కల్లం వెంకట సుబ్బారెడ్డి, యక్కలి శేషగిరిరావు, జి.శ్రీనివాసులు, గొలమారి చెన్నారెడ్డి, ఇమ్మడి కాశీనాథ్, శాసనాల వీరబ్రహ్మం, వరికుంట్ల అనిల్, తాడికొండ వెంకటరావు తదితరులు ఉన్నారు.

విలేకరులపై దాడి చేసిన వారిని శిక్షించాలి


సీఐకి వినతి పత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

గిద్దలూరు రూరల్: మండలంలోని ముండ్లపాడులో ఆరవీటి శ్రీను అతడి కుటుంబ సభ్యులు కలిసి ఇద్దరు విలేకరులపై దాడికి పాల్పడటంపై గిద్దలూరు జర్నలిస్టులు సోమవారం ఖండించారు. ఈ మేరకు స్థానిక సీఐ వైవీ సోమయ్యను కలిసి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. ముండ్లపాడు గ్రామానికి చెందిన ఆరవీటి శ్రీను గ్రామంలో అనధికారికంగా లేఔట్ వేసి ప్లాట్లు వేశాడని, అదే గ్రామానికి చెందిన సత్యం సోషల్ మీడియాలో ప్రచారం చేశాడు. దీంతో అతడిపై దాడికి పాల్పడ్డారు. దీంతో సత్యం తనపై దాడి చేస్తున్నారని మరో విలేకరి మున్నాకు ఫోన్ చేయడంతో అతడు సంఘటనా స్థలం వద్దకు చేరుకుని సత్యంపై జరుగుతున్న దాడిని చిత్రీకరించేందుకు ప్రయత్నించాడు. దీంతో ఆగ్రహించిన ఆరవీటి శ్రీను కుటుంబ సభ్యులు మున్న ఫోన్, బైక్‌ను ధ్వంసం చేశారు. ఈ విషయమై సత్యం, మున్నాలు ఇద్దరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాడిలో తీవ్రంగా గాయపడిన సత్యం ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. విలేకరులపై జరిగిన దాడిని గిద్దలూరు జర్నలిస్టు సంఘం నాయకులు ఖండించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు శిగులపల్లె శ్రీనివాసులు, సూరే కృష్ణారావు, రసూల్, రామిరెడ్డి, రాజ్‌కుమార్ యాదవ్, సుధీర్, శివ, జగన్, జనార్దన్‌రెడ్డి, కాశిరెడ్డి, అంకయ్య, ఖాజా, రసూల్, రమణయ్య, ఖలీల్, రఫీ, వేములపాటి శేఖర్, నెమలిగుండం, గిరి ఉన్నారు.

క్రీడామైదానంలో చెత్త పడేస్తున్న స్థానికులు


క్రీడామైదానం లోపల స్థానికులు వేస్తున్న చెత్తాచెదారం


మైదానంలో సంచరిస్తున్న పందులు

- స్వైరవిహారం చేస్తున్న పందులు

కంభం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో పందులు స్వైరవిహారం చేస్తుండటంతో విద్యార్థులు, ఉదయం పూట వాకింగ్‌కు వచ్చే ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలలకు కలిపి విశాలమైన క్రీడామైదానం ఉంది. సుమారు 700 మందికి పైగా విద్యార్థులు ఇక్కడ చదువు కుంటున్నారు. విశ్రాంతి సమయంలో విద్యార్థులు మైదానంలోకి వెళ్లి ఆడుకుంటుంటారు. జోనల్స్, ఇతర పోటీలు ఇక్కడే నిర్వహిస్తుంటారు. మైదానం చుట్టూ ప్రహరీ ఉన్నప్పటికీ రక్షణ లేకపోవడంతో పందులు, ఇతర జంతువులు మైదానంలోకి ప్రవేశిస్తున్నాయి. చుట్టుపక్కల నివాసం ఉండే ప్రజలు తమ ఇళ్లలోని వ్యర్థాలను క్రీడామైదానంలోని ప్రహరీ వెంట పడేస్తుండటంతో పందులు సంచరిస్తున్నాయి. మైదానానికి మరోవైపు ప్రహరీ వెంట ఆనుకొని ఉన్న గృహాల వారు తమ ఇళ్లలోని మురుగునీటిని పైపులు పెట్టి మరీ మైదానంలోకి వదిలేస్తున్నారు. పంచాయతీ అధికారులు, విద్యాశాఖాధికారులు స్పందించి మైదానంలో వ్యర్థాలు పడేయకుండా చర్యలు తీసుకోవడంతో పాటు పందులు సంచరించకుండా చూడాలని ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు.

విద్యార్థులకు చేయూత ఇవ్వడం అభినందనీయం

శివరామపురం (ముండ్లమూరు): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు దాతలు చేయూత ఇవ్వడం అభినందనీయమని తాళ్లూరు మండల విద్యాశాఖాధికారి-2 ఎల్. సుధాకరరావు అన్నారు. మండలంలోని శివరామపురం ప్రాథమిక పాఠశాల (జనరల్)లో సోమవారం విద్యార్థులకు దాతలు కావలికి చెందిన గనుపూడి పవన్‌కుమార్..ఆయన తల్లి సుబ్బరత్తమ్మ జ్ఞాపకార్థం ఐదు వేల విలువైన, పొదిలి వర్తక సంఘం నాయకులు గునుపూడి భాస్కర్ వారి తల్లిదండ్రులు సుబ్బారావు, వరలక్ష్మమ్మ జ్ఞాపకార్థం ఐదు వేలు మొత్తం పది వేల విలువైన నోట్ పుక్స్, అభ్యాసన సామగ్రిని ఎంఈఓ-2 ద్వారా విద్యార్థులకు అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.శ్రీనివాస్, ఉపాధ్యాయులు వీరనాగిరెడ్డి, కళ్యాణ్‌రావ్, వేణు, అరుణ పాల్గొన్నారు.

నూతన క్రిమినల్ చట్టాలపై అవగాహన


బేస్తవారిపేటలో మాట్లాడుతున్న ఎస్సై నరసింహారావు


అవగాహన కల్పిస్తున్న సబ్‌జైలర్ శ్రీనివాసరావు


చింతగుంటలో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఐ

మార్కాపురం: ఈనెల 1వ తేదీ నుంచి అమలులోకి వచ్చిన మూడు కొత్త క్రిమినల్ చట్టాలపై ఖైదీలకు అవగాహన కలిస్తున్నట్లు సబ్‌జైలర్ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం పట్టణంలోని సబ్‌జైలులో ఏర్పాటు చేసిన నూతన క్రిమినల్ చట్టాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధీనియం లాంటి నూతన క్రిమినల్ చట్టాలను జూలై 1వ తేదీ నుంచి అమలులోకి వచ్చినట్లు తెలిపారు. ఖైదీలు ఈ చట్టాలపై అవగాహన కలిగివుండాలని అన్నారు. కార్యక్రమంలో మండల లీగల్ సర్వీస్‌అథారిటీ సభ్యులు పి రాచంద్ర, ఏ ఉషశ్రీ, పారా లీగల్ వలంటీర్లు ఆదినారాయణ, బాషా, మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ సిబ్బంది, సబ్‌జైలు అధికారులు పాల్గొని నూతన చట్టాలపై అవగాహన కల్పించారు.

కొనకనమిట్ల: గ్రామాల్లో ఎవరైనా అల్లర్లు సృష్టించి గొడవలకు కారణమవుతారో అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మాధవరావు అన్నారు. సోమవారం కొనకనమిట్ల, చింతగుంట గ్రామాల్లో పర్యటించి శాంతి భద్రతలపై ప్రజలకు అవగాహన కలిపించారు. కొత్త చట్టాలు, న్యాయపరమైన అంశాలపై ప్రజలకు అవగాహన కలిపించారు. అనంతరం కొనకనమిట్ల వద్ద జాతీయ రహదారిపై పలు వాహనాలను తనిఖీ చేశారు.

బేస్తవారిపేట: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై నరసింహారావు అన్నారు. సోమవారం స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్లో విద్యార్థినులకు కొత్త నేర చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పిల్లల్ని కొనడం, అమ్మడం ఘోరమైన నేరంగా, మైనర్‌పై సామూహిక అత్యాచారానికి మరణశిక్ష లేదా జీవిత ఖైదు నిబంధన తెచ్చారన్నారు. కొత్త చట్టాల ప్రకారం ఫిర్యాదుల నుంచి సమన్ల దాకా అన్నీ ఆన్‌లైన్‌లో జరగనున్నాయి. ఎస్ఎంఎస్ ద్వారా కూడా సమన్లు పంపవచ్చునని తెలిపారు. ఏ పోలీస్ స్టేషన్‌లో అయినా ఎఫ్ఐఆర్ దాఖలు చేసే జీరో ఎఫ్ఐఆర్ విధానం ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. విద్యార్థులు కష్టపడి చదువుకోవాలన్నారు. ఉన్నత లక్ష్యాన్ని పెట్టుకోవాలని, లక్ష్య సాధన కోసం శ్రమించాలని కోరారు. హెచ్‌ఎం కర్నాటి తిరుపతిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.